క్లుప్తంగా

క్రీడాకారులకు దుస్తుల అందజేత



ఆర్మూర్: గల్ఫ్‌లోని బహ్రెయిన్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ క్రికెట్ జట్టుకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ రాజు రెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు ఇక్కడి వారికి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అండగా ఉంటున్నారని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కోటగల్లి జీపీఎస్ ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్‌ఎంగా రామ్ చందర్ గైక్వాడ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జెండాగల్లీ పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. సెప్టెంబర్ 2023లో బదిలీ అయిన ఉపాధ్యాయులను విద్యాశాఖ రిలీవ్ చేయకుండా ఇన్ని రోజులు ఆపింది. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రిలీవ్ చేయడంతో జెండాగల్లీ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రామచందర్ గైక్వాడ్ శుక్రవారం మధ్యాహ్నం రిలీవ్ అయి కోటగల్లీలో జాయిన్ అయ్యారు.

విద్యార్థులకు అవగాహన



నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవ నగర్‌లో చిన్నారులకు బాల సంఘం ఆధ్వర్యంలో చదువుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు,పెద్దలతో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో బాలసంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన కిశోర్‌గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ శ్రీధర్, కిరణ్, ఆకుల జగన్, మాజీ సర్పంచ్ రమేష్, మహేష్‌గౌడ్, మోహన్, సుదర్శన్‌గౌడ్, చందర్, సన్నీ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు



ఇందల్వాయి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ శనివారం తనిఖీ చేశారు. ప్రతి హాస్పిటల్‌కు అగ్నిమాపక శాఖ అనుమతి ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య పరికరాలను తనిఖీ చేసి బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేయొద్దని, రోగులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు.

తొలగించడం అన్యాయం

ఖలీల్‌వాడి: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో వివిధ విభాగాల్లో పనిచేస్తూ 61 ఏళ్లు నిండిన వారిని తొలగిస్తామనడం అన్యాయమని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ అన్నారు. ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నగరంలోని కోటగల్లీలోని ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీలో నాన్ టీచింగ్ వర్కర్లు పదహారేళ్లకు పైగా వెట్టిచాకిరి చేశారన్నారు. వీరికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవన్నారు. తొలగింపు నిర్ణయాన్ని ఏడాది పాటు వాయిదా వేయాలని కోరారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి రూ.2 లక్షలు, వర్కర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, నాయకులు వెంకన్న, రమేష్, కిషన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి ఏడాది..!

- రూ. 42.50లక్షల పనులకు గ్రహణం
- పూర్తి కాని గ్రంథాలయ నిర్మాణం
- ఇబ్బందుల్లో పాఠకులు
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో కొనసాగుతున్న గ్రంథాలయ నిర్మాణ పనులు

ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న గ్రంథాలయ నిర్మాణ పనులు ఏడాది గడిచినా పూర్తి కాకవపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పోటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తుండడంతో నిరుద్యోగులు ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. దీంతో గ్రంథాలయాలకు పాఠకుల తాకిడి పెరిగింది. ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని జంబిహనుమాన్ ఆవరణలో ఉన్న గ్రంథాలయానికి సుమారు వందకు పైగా నిత్యం పాఠకులు, నిరుద్యోగులు వస్తుంటారు. గ్రంథాలయానికి ముందుగా వచ్చే వారికి కూర్చునేందుకు స్థలం దొరుకుతోంది. మిగతా వారు నిల్చుండి చదవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గుర్తించిన గత ప్రభుత్వంలో ఉన్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి 2023 మే నెలలో గ్రంథాలయ భవనంపై మొదటి అంతస్తు నిర్మాణ పనుల ప్రారంభానికి కృషి చేశారు. జిల్లా గ్రంథాలయ నిధుల నుంచి రూ. 42.50 లక్షల అంచనా వేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించి ఏడాది గడిచినా ఇంకా పూర్తి కాలేదు. ఫలితంగా పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. భవన నిర్మాణంలో పల పనులు ఇంకా మిగిలే ఉన్నాయి. ప్రస్తుతం గ్రంథాలయంలో మహిళలకు, పురుషులకు ఒక్కొక్క మరుగుదొడ్డు మాత్రమే ఉండడంతో అవస్థలు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణంలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పాఠకులు, నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రంథాలయంలో పనులు నెమ్మదిగా కొనసాగుతు న్న వాటిపై గ్రంథపాలకురాలు వరలక్ష్మిని వివరణ కోరగా నెలలో పనులు పూర్తి చేయాలని ఉన్నతాధి కారులు కాంట్రాక్టర్‌కు సూచించినట్లు పేర్కొన్నారు.

పూర్తి కాని పనులు.. తీరని అవస్థలు!



బాల్కొండలో నిర్మాణ దశలో ఉన్న పనులు

బాల్కొండ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మూత్ర శాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో పాఠకులు, నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక పఠనం కోసం ప్రతి రోజు సుమారు 50 మంది కన్నా ఎక్కువ వస్తుంటారు. కానీ గ్రంథాలయంలో సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 15 లక్షల నిధులను మంజూరు చేసింది. కానీ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ గత మూడు నెలలుగా సరిగా పనులు చేయడం లేదు. అసలే గ్రంథాలయంలో సరైన సౌకర్యాలు లేవని దీనికి తోడు కనీస సౌకర్యాలు సైతం లేకపోవడంతో పాఠకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయం ఇరుకు గదిలో ఉండటంతో పాఠకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉన్న గ్రంథ పాలకురాలు ఇన్‌చార్జి కావడం సమయపాలన పాటించపోవడంతో ఇటు పాఠకులు, నిరుద్యోగులు సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి

గ్రంథాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. గ్రంథాలయానికి ఆలస్యంగా వచ్చిన వారికి స్థలం దొరకక తిరిగి వెళ్లిపోతున్నారు. భవన నిర్మాణం పూర్తియితే ఎక్కువ మంది నిరుద్యోగులు, పాఠకులు చదువుకునేందుకు అవకాశం ఉటుంది.

– గోవర్ధన్, ఆర్మూర్

అధికారులు చొరవ తీసుకోవాలి

భవన నిర్మాణం త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. పనులు ఆలస్యం కావడంతో విద్యార్థులు నిరుత్సాహ పడుతున్నారు. దీంతో వారు గ్రంథాలయాలకు రాలేకపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– సుశీల, ఆర్మూర్

కనీస సౌకర్యాలు కల్పించాలి

గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. కనీస సౌకర్యాలు లేక పాఠకులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయంలో వెంటనే మరుగుదొడ్లు, మూత్రశాలలను నిర్మించాలి.

– శంకర్, బాల్కొండ

దూదిగాంలో తాగునీటి సమస్య



వాటర్ ట్యాంకర్‌తో నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో తాగు నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు పనుల్లో కల్వర్టు నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. దీంతో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌తో పాటు, కాలనీల్లోకి సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైన్‌లు పగిలిపోయాయి. వీటిని మరమ్మతు చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. ఫలితంగా గ్రామంలో నీటి సమస్య తలెత్తింది. దీంతో జీపీ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేపట్టిన అందడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీపీ నుంచే మరమ్మతులు చేపట్టాలని ఇటు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ పగులగొట్టిన పైపులైన్‌కు కాంట్రాక్టరే మరమ్మత్తులు చేపట్టాలని జీపీ అధికారులు పేర్కొంటన్నారు. దీంతో మరమ్మతులు జరగక నీటి సరఫరా కావడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జీవితంలో గెలుపోటములు సహజం

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



అమెరికాలో నిర్వహించిన మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్: జీవితంలో గెలుపోటములు సహజమని, ఓటమి నుంచి నేర్చుకొని కొత్త ఉత్సాహంతో బీఆర్ఎస్ శ్రేణులు ముందుకెళ్లాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన యూఎస్ఏ క్రికెట్ బోర్డు చైర్మన్ వేణు, పీసీకే డైరెక్టర్ శ్రీనివాస్ ఆహ్వానం మేరకు అమెరికా టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ సిటీలో అమెరికా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. ఇటీవల వెలువడిన ఎన్నికల ఫలితాలపై శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. క్రికెట్‌లో బలమైన జట్టుగా పేరుపొందిన పాకిస్థాన్, ఇప్పుడిప్పుడే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన పసికూన అమెరికా చేతిలో ఓడిపోవడం జీవితంలో ఎన్నో విషయాలను మనకు గుర్తు చేస్తుందన్నారు. రాజకీయాల్లో కూడా ఓటమిని స్పోర్ట్స్ స్పిరిట్‌గా తీసుకోవాలని, బీఆర్ఎస్ శ్రేణులు కూడా మొన్నటి ఫలితాలతో నిరుత్సాహ పడకుండా రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ పుంజుకొని విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు



ఆర్మూర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసినా పట్టణంలోని పలు విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదు. పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి, పలు చోట్ల వేసి పలు పార్టీల నాయకుల విగ్రహాలకు అధికారులు వేసిన ముసుగులు తీయలేదు. కోడ్ ముగిసినా విగ్రహాలపై వేసిన ముసుగులు తీయకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఏడు నెలల నిరీక్షణకు తెర

రుద్రూర్: ఏడు నెలల క్రితం బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం రిలీవ్ అయ్యారు. సుదీర్ఘ కాలంగా మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గత ఏడాది అక్టోబర్‌లో బదిలీలు జరిగాయి. ఎస్‌జీటీల పదోన్నతులు నిలిచిపోవడంతో వీరు పని చేస్తున్న పాఠశాలకు మరొకరు రానందున పాత పాఠశాల నుంచి రిలీవ్ కాలేదు. దీంతో బదిలీ అయిన పాఠశాలకు పంపాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పాత పాఠశాలల్లోనే పని చేస్తున్నారు. ఎట్టకేలకు బదిలీ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఏడు నెలల క్రితం బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం రిలీవ్ చేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలో 25 మంది, రుద్రూర్ మండలంలో నలుగురు ఉపాధ్యాయులు రిలీవ్ అయినట్టు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

గ్రామాల్లో బడిబాట



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



దూపల్లిలో తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు

వేల్పూర్: మండల కేంద్రంలో స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తే రూ. వేల ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే ఎలాంటి ఫీజులు కట్టాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఉచితంగా లభిస్తాయన్నారు. మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనం కూడా వస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం నూతనంగా 10 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులు బోడ దేవానందం, వనిత, శారద, వెంకటేశ్వర్, రవికుమార్, ఆశా వర్కర్లు కవిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్: స్థానికంగా అందుబాటులో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని దూపల్లిలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతు ప్రచారం నిర్వహించారు. శనివారం 'బడిబాట'లో భాగంగా గ్రామంలో తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఉన్న వ్యత్యాసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సాయన్న, శ్రీనివాస్, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

బోధన్‌టౌన్: పట్టణంలోని 10 వార్డులో ఉన్న గోసం బస్తీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో జానకి మాట్లాడారు. ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలను ప్రైమరీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ర్యాలీలో సూపర్ వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు విక్టోరియా, రాణి, సరోజ, రత్నం తదితరులు ఉన్నారు.



వేల్పూర్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎరువుల దుకాణం తనిఖీ



రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో ఉన్న రెండు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం రాత్రి పోలీసులు, ఏవో తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి ఎరువుల బస్తాలను తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూరల్ సీఐ నరేశ్‌కుమార్, వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్సై సాయన్నలు దుకాణాలను తనిఖీ చేశారు. వానా కాలం సీజన్‌కు సంబంధించి దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు నష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకునాలని దుకాణ యజమానులకు సూచించారు.

1163 కేసుల పరిష్కారం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తాన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మెయింటెన్స్, సీసీ, సైబర్‌క్రైమ్, ఎక్సైజ్, పెట్టి, ఇతర కేసులను ఇరు వర్గాల రాజీతో 1163 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతరం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు, న్యాయవాదులు, బార్‌అసోసియేషన్ సభ్యులు, బ్యాంక్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ ఆలయ వార్షికోత్సవాలను ఆది, సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకలకు హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి హాజరుకానున్నట్లు వెల్లడించారు.

పొతంగల్‌లో సమ్మేళనం

పొతంగల్(రుద్రూర్): పొతంగల్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–04కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులు విజయవంతం చేయాలన్నారు.

అభ్యర్థులకు నాసిరకం భోజనం

నిజామాబాద్ అర్బన్: పోటీ పరీక్షల శిక్షణ కోసం ఎస్సీ స్టడీ సెంటర్‌కు వస్తున్న విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభ్యర్థులకు మంచి భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. స్టడీ సెంటర్‌లో వసతులు కల్పించాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

హనుమాన్ చాలీసా పారాయణం



రుద్రూర్: మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ రక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం చేశారు. అర్చకులు నరేశ్‌బాబా తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి శనివారం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	లవ్‌బాయ్స్ (తెలుగు) - 11.05, వెపన్(తెలుగు) - 1.50, భజే వాయువేగం - 4.30, లవ్‌మౌళి (తెలుగు) - 7.25, రక్షణ - 10.30
స్క్రీన్-3 –	మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	సత్యభామ - 10.50, 4.50, 10.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి - 1.45, బ్యాడ్‌బాయ్స్ - 7.45

పత్తాలేని ఫాగింగ్..

- దోమల స్వైర విహారం
- పట్టపగలే విజృంభణ
- పారిశుధ్య లోపం, మురుకి నీరే కారణం
- పట్టించుకోని అధికారులు



ఆర్మూర్‌టౌన్: కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని పలు కాలనీల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టపగలే దోమలు ప్రజలపై దాడి చేస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పట్టి పీడిస్తున్నాయి. పారిశుధ్యం లోపం డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పలు కాలనీల్లో ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది.

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉన్నాయి. ఆర్మూర్, పెర్కిట్, మామిడిపల్లిలో కలిపి సుమారు 90వేల జనాభా నివసిస్తోంది. మున్సిపల్ పరిధిలో ఆరు ఫాగింగ్ మిషన్‌లు ఉన్నాయి. ఈ ఆరు మిషన్లు మరమ్మతులకు గురయ్యాయి. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు దృష్టి సారించడం లేదు. వర్షాలు కురిస్తే చాలు కాలనీల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు వృద్ధి చెందే అవకాశం ఏర్పడుతోంది. దీంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమకాటుతో ప్రజలు వ్యాధుల బారిన పడి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.

జాగ్రత్త చర్యలు కరువు

వర్షాకాలం ప్రారంభమైనందున దోమల నియంత్రణపై అధికారులు చర్యలు చేపట్టాలి. ఒకవైపు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. దోమలు వృద్ధి చెందకుండా శానిటేషన్ అధికారులు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలి. వర్షాకాలంలో ఫాగింగ్ యంత్రాలతో స్ప్రే చేయాలి. అందుకోసం అధికారులు వీటిని ముందస్తుగానే సిద్ధం చేయాల్సి ఉంటుంది. మిషిన్లు మరమ్మతులు గురయ్యాయని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మిషిన్లకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతులు చేయిస్తాం



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ఫాగింగ్ మిషిన్ల ద్వారా పిచికారీ చేయిస్తాం. దోమలు వృద్ధి కాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. చెడిపోయిన గుర్తైన ఫాగింగ్ మిషిన్లకు మరమ్మతులు చేయిస్తాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899